క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ


సుంకులమ్మ దేవి

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం శ్రీసుంకులాపరమేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ అమ్మవారి విగ్రహం, యంత్రాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించి విగ్రహాన్ని ఆలయ గర్భగుడిలో ప్రతిష్ఠించారు. అనంతరం కలశ శిఖరప్రతిష్ఠ, అలంకారం, బలిహారతి, పూర్ణాహుతి, వంటి విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీశైలం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాధ్యతల స్వీకరణ


మురళీధర్‌రెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా మురళీధర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గురువారం శ్రీశైలం చేరుకుని ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించుకుని అనంతరం కార్యాలయానికి చేరుకుని ఈఈగా బాధ్యతలు స్వీకరించారు. శ్రీశైల దేవస్థానంలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఎం.నరసింహారెడ్డి అన్నవరం దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీకాళహస్త ఆలయంలో విధులు నిర్వహిస్తున్న మురళీధర్‌రెడ్డిని ఈఈగా పదోన్నతి కల్పిస్తూ శ్రీశైలానికి బదిలీ చేశారు. క్షేత్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని, భక్తులకు సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తానని ఈఈ తెలిపారు.

భూముల వేలాల్లో పెరిగిన ఆదాయం

మహానంది: బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన భూములకు గురువారం నిర్వహించిన వేలాల్లో ఆదాయం పెరిగినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆలయాలకు చెందిన 38.94 ఎకరాల భూములకు గతేడాది రూ. 3.33లక్షలు రాగా ప్రస్తుతం జరిగిన వేలాల్లో రూ. 8.78లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. దీంతో ఈ ఏడాది రూ. 5.45లక్షలు ఆదాయం పెరిగినట్లయ్యిందని చెప్పారు. వీటితో పాటు ఓంకార క్షేత్రంలోని ఓంకార సిద్ధేశ్వరస్వామికి చెందిన 7.60 ఎకరాల భూమికి గతేడాది రూ.50వేలు రాగా ప్రస్తుతం రూ. 1.64లక్షలు వచ్చిందని, రూ. 1.14లక్షలు పెరిగినట్లు వివరించారు. మొత్తం కలిపి రూ. 10.42లక్షలు ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. వేలంపాట కార్యక్రమాల్లో దేవదాయశాఖ నంద్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, రైతులు పాల్గొన్నారు.

రాయితీ ఉల్లి విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఉల్లి విత్తనాలను రాయితీపై ఇస్తున్నట్లు నందికొట్కూరు హార్టీకల్చర్ అధికారిణి తేజశ్విని తెలిపారు. అగ్రిఫౌండ్ డార్క్‌రెడ్ విత్తనాలు కిలో రూ.1,100లు, ఎల్–883 రకం విత్తనాలు కిలో రూ.1,200ల చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఎకరాకు రెండుకిలోల చొప్పన ఐదు ఎకరాల వరకు ఉల్లి విత్తనాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉల్లి పంటను సాగుచేయనున్న రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

మహానందిలో నేడు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానంది దేవస్థానంలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి, కోదండరామాలయం, ఆంజనేయస్వామి, వినాయకనంది ఆలయాలతో పాటు అన్నదానం, గోసంక్షరణ విభాగం హుండీ కానుకలను లెక్కిస్తామన్నారు. స్థానిక అభిషేక మండపంలో జరిగే కార్యక్రమానికి సిబ్బంది అందరూ డ్రెస్‌కోడ్ పాటిస్తూ హాజరు కావాలని కోరారు.

చోరీ ఘటనపై విచారణ

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తులకు చెందిన నగదును చోరీ చేసిన ఘటనలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట్‌కు చెందిన కొందరు భక్తులు ఈ నెల 5వ తేదీన స్థానిక చిన్నకోనేరులో స్నానానికి వెళ్లగా వారి దుస్తులు, అందులో మనీపర్సు, ఇతర వస్తువులను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.30వేల నగదు ఉన్నట్లు సమాచారం. మహానంది ఎస్‌ఐ జి.నాగేంద్ర ప్రసాద్ విచారణ ప్రారంభించారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నంద్యాలకు చెందిన ఓ దొంగను గుర్తించినట్లు తెలిసింది.

కనీస వేతనం అమలు చేయాలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో తొలమాలీలుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలను అమలయ్యేవిధంగా కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం కోరారు. గురువారం శ్రీశైలంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. గోపాల్‌నాయక్, రాజు నాయక్, శ్రీను, జానకీరామ్ ఉన్నారు.

గాలీవాన బీభత్సం

- విరిగిన విద్యుత్ స్తంభాలు
- నారాయణాపురంలో దెబ్బతిన్న పది ఇళ్లు
- 900 ఎకరాల్లో నేలకొరిగిన అరటిచెట్లు

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో గాలీవాన బీభత్సం సృష్టించింది. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన భారీ వర్షం, భీకరగాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. బండిఆత్మకూరు మండలం నారాయణాపురంలోని మేదరకాలనీలో సుమారు పదిగుడిసెలు దెబ్బతిన్నాయి. పైకప్పులు, రేకులషెడ్లపై రేకులు ఎగిరిపడటంతో పేదలు అవస్థలు పడుతున్నారు. వీరయ్య ఆచారి నివాసం ఉంటున్న ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపడిన ఘటనలో ప్రమాదం తప్పింది. సమయానికి బయట ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం లేదని స్థానికులు తెలిపారు. మేదరకాలనీలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో పేదలు నివాసం ఉంటున్న గుడిసెలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మహానంది మండలం గాజులపల్లె మజరా గ్రామమైన బసవాపురంలో జ్యోతుల రామస్వామికి చెందిన మట్టిమిద్దె కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

విద్యుత్‌శాఖకు రూ.పదిలక్షలు నష్టం

గాలివాన బీభత్సంతో విద్యుత్ స్థంభాలు, డీటీఆర్ఎస్ ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపడ్డాయి. మహానంది మండల పరిధిలో ఎనిమిది 25కేవీ డీటీఆర్ఎస్ ట్రాన్స్‌ఫార్మర్లు, 25 విద్యుత్ స్తంభాలు విరిగిపడినట్లు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. విద్యుత్‌శాఖకు సుమారు రూ. పదిలక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ఏఈ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. స్థంభాలు విరిగిపడటంతో విద్యుత్‌శాఖ లైన్‌మెన్లు, ఎఎల్ఎంలు, జెఎల్ఎంలు, సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి లైన్లను బుధవారం అర్ధరాత్రి వరకు సరిచేసే పనిలో నిమగ్నయ్యారు.

అరటి రైతులకు సుమారు రూ. పది కోట్లు నష్టం

మహానంది మండలంలోని బుధవారం వచ్చిన భారీ గాలులు, వర్షానికి అరటిరైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 900 ఎకరాల్లో అరటి చెట్లు నేలకొరిగినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మండలంలోని తిమ్మాపురం, బుక్కాపురం, గాజులపల్లె, గోపవరం, మహానంది, కృష్ణనంది, జమాలయ్యదర్గా సమీపంలో సాగు చేస్తున్న అరటితోటల్లో వందల సంఖ్యలో చెట్లు నేలకొరిగాయి. ఎకరాకు 900 చెట్లు సాగు చేస్తుంటే సగానికి పైగా చెట్లు నేలకొరిగాయని, ఎకరాలకు రూ.1.50లక్షల పెట్టుబడులు పెట్టామని రైతులు వాపోయారు. బుక్కాపురంలో రమణయ్య, శ్రీనివాసులు, కుంచపు వెంకటేశం, చిన్నమాబుశేని, తిమ్మాపురంలో పెద్ది శ్రీనివాసులు, కోటయ్య, శివ, నారాయణ, అయ్యన్ననగర్ రాజు, మహానంది శంకర్, వీరితో పాటు వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న అరటితోటలు నేలమట్టం కావడంతో కన్నీరుమున్నీరయ్యారు. సుమారు రూ. పది కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం.


మహానందిలో నేలకొరిగిన అరటిచెట్లు

900 ఎకరాల్లో నేలకొరిగిన 'అరటి'

బుధవారం వచ్చిన భారీవర్షం, గాలులకు మహానంది మండలంలో అరటిచెట్లు నేలకొరిగాయి. గురువారం కొన్ని పొలాలను సందర్శించి నష్టతీవ్రతను పరిశీలించాం. ప్రాథమికంగా 900 ఎకరాల్లో అరటిచెట్లు పడిపోయినట్లు గుర్తించాం. 33శాతం కంటే ఎక్కువగా నష్టం జరిగితేనే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వస్తుంది. శుక్రవారం జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, జిల్లా అధికారులు రానున్నారు. పూర్తి స్థాయిలో అరటితోటలను పరిశీలించి నష్టపోయిన రైతులు, విస్తీర్ణం వివరాలను ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం.
– శ్రీధర్, ఉద్యానశాఖ అధికారి, మహానంది


నారాయణాపురంలో దెబ్బతిన్న గుడిసెలు

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ నెల 9న నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంతో పాటు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. 10 వతరగతి నుంచి ఉన్నత చదువులు చదివిన వారందరూ అర్హులేనన్నారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షుడు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, నాగన్న, పుల్లయ్య, విజయ్, రామకృష్ణారెడ్డి, పువ్వాడ భాస్కర్, సుల్తాన్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మగుడి నిర్మాణానికి భూమిపూజ

మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో గురువారం శ్రీ సంత్‌సేవాలాల్ మహరాజ్, మారెమ్మ గుడి నిర్మాణాలను శిల్పా భువనేశ్వరరెడ్డి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శక్తి వంచన లేకుండాపూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచు నారాయణరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈఓఆర్డీ పుల్లయ్య సేవలు మరువలేనివి

పగిడ్యాల: మండలంలో ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తూ ఎంపీడీఓగా పదోన్నతి పొంది అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లిన పుల్లయ్య సేవలు మరువలేనివని మండల జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, ఎస్‌ఐ నాగార్జునలు కొనియాడారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన పుల్లయ్యకు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, ఏఈ వెంకటేశ్వర్లు, ఏఓ విజయ్‌జ్యోతుకుమార్, ఏపీఓ మద్దిలేటి, వైస్ ఎంపీపీ పల్లె అరుణమ్మ, కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాష, సర్పంచ్‌లు పెరుమాళ్ల శేషన్న, వై. ప్రభాకర్‌రెడ్డి, పెద్ద ఆంజనేయులు, రాజేశ్వరి, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఎంపీడీఓగా పదోన్నతి పొందిన పుల్లయ్యతో అధికారులు, ప్రజాప్రతినిధులు

పొలం రస్తా అభివృద్ధికి రూ. 15లక్షలు

మిడుతూరు: నందికొట్కూరు – మిడుతూరు రహదారిలో ఉన్న పంచముఖి వేర్ హౌస్ నుంచి నాగలూటి వైపు పొలాలకు వెళ్లే రాస్తా అభివృద్ధికి రూ. 15 లక్షలు ఎంపీ లాండ్స్ కింద మంజూరైనట్లు పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి తెలిపారు. గురువారం గ్రామ సర్పంచ్ ఉషారాణి ఆధ్వర్యంలో పొలం రస్తా అభివృద్ధి పనికి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి విజ్ఞప్తి మేరకు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సహకారంతో ఎంపీ ల్యాండ్స్ నుంచి రూ.15 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఏపీ శాప్‌చైర్మన్, ఎంపీలకు గ్రామంలోని రైతుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సర్వేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, నీలకంఠేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న దృశ్యం

కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి

ఆత్మకూరు: కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణకార్యదర్శి రామ్‌నాయక్ కోరారు. గురువారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రణధీర్, సుకేంద్ర పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేయాలి

పాములపాడు: జగనన్న కాలనీలోని గృహ లబ్ధిదారులు త్వరిత గతిన నిర్మాణాలు పూర్తి చేయాలని తహసీల్దార్ రత్నారాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ సూచించారు. గురువారం స్థానిక జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లను ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలన్నారు. గ్రామ వలంటీర్లు, అసిస్టెంట్ ఇంజనీరు, పంచాయతీ కార్యదర్శి లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ శివరామకృష్ణారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

మహానంది: బండిఆత్మకూరు మండలం అయ్యవారికోడూరులో గురువారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిప్రమాదంలో రెండు గడ్డివాములు దగ్ధమైనట్లు బాధిత రైతు బాలీశ్వరరెడ్డి తెలిపారు. సుమారు రూ.లక్ష మేరకు నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న నంద్యాల అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు.

11న ప్రవేశ పరీక్ష

పాములపాడు: ఏపీ మోడల్ స్కూలులో 6 వతరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 11న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నాగరవీంద్ర గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకొనిరావాలని సూచించారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం నిత్యాకళావేదికపై అనంతపురానికి చెందిన సి.నాగలక్ష్మి వారిచే నిర్వహించిన భక్తి సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది. గణపతి ప్రార్ధన, శంకరా ఓ శంకరా పలు అష్టకాలను, భక్తి గీతాలను సి.నాగలక్ష్మీ, సి.పోతులయ్య, జి.అంగమ్మ, సుబ్బమ్మ, జి.లక్ష్మీదేవి తదితరులు ఆలాపించారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

శ్రీశైలంప్రాజెక్ట్: బడి ఈడు పిల్లలు బడిలో చదువుకునేలా అన్ని గిరిజన గూడేలలో చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. గురువారం సున్నిపెంటలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు చెందిన గిరిజన గురుకుల, ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఓ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున పరిసరప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులు పరిశుభ్ర పరచాలని, విద్యార్థులకు విధిగా మెడికల్ టెస్ట్‌లు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ మురళీధర్, ఏటీడబ్ల్యూఓ అమరసుబ్బయ్య, ఏఎంఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఓ రవీంద్రారెడ్డి

వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- వలంటీర్లకు సేవా పురస్కారాలు


సేవా రత్న పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: కులం, మతం, రాజకీయం చూడకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం శ్రీశైలంలోని మల్లికార్జున కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆత్మకూరు ఎంపీడీవో మోహన్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఆత్మకూరు మండల పరిధిలో వలంటీర్లకు సేవా వజ్ర–2, సేవారత్న–9, సేవా మిత్ర–296 పురస్కారాలు వచ్చాయి. సేవారత్న పురస్కారానికి ఎంపికైన శిరాతున్‌షేక్, షబీరా దుదేకు ల, పాణ్యం రవి తేజ, శ్రీశైలంకు చెందిన సుకన్యలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా శాలువాలు కప్పి, మెడల్ వేసి, పురస్కారాన్ని అందించారు. అనంతరం ఎమ్మె ల్యే మాట్లాడుతూ వలంటీర్ల గురించి.. సంచులు మోసే ఉద్యోగమని ఏదేదో చెప్పి ప్రతిపక్ష నాయకులు హేళన చేసి మాట్లాడారని, అలాంటి వారే ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని అంటున్నారంటే వలంటీర్ల వ్యవస్థ ఎలా పనిచేస్తుందో అర్థమవుతుందన్నారు.

ప్రతిపక్షాలది మార్నింగ్ వాక్, ఈవినింగ్ వాక్

నియోజకవర్గంలో ప్రతిపక్షాలు తాము ఉన్నామని ప్రజలు గుర్తుంచుకోవాలని మార్నింగ్ వాక్, ఈవినింగ్ వాక్‌లు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. నాది ఎల్లప్పుడు ప్రజలతో నిరంతర వాక్ అని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు వారి సొంత ఊర్లో 80శాతం మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్నారని చెప్పారు. త్వరలో సున్నిపెంటలో ఎవరి గృహాలను వారికే రెగ్యులరైజేషన్ చేస్తానని అన్నారు.

శ్రీశైలంలో వేగంగా అభివృద్ధి

సున్నిపెంటలో 2011లో ఒక్క ట్యాంకు ద్వారా తాగునీటి సరఫరా అయ్యేదని, తాగునీటికి ప్రజలు అల్లాడేవారని తాను వచ్చిన తరువాత ప్రస్తుతం 7ట్యాంకుల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. శ్రీశైలం మండల పరిధిలో అన్ని ఏరియాలలో సీసీ రోడ్లు వేశామని, సొంత నిధులతో వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేస్తున్నానని, రూ.20లక్షలతో ఉచిత అంబులెన్స్ సర్వీసును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చానని చెప్పారు. పార్టీలతో సంబంధం లేకుండా వ్యాపారులకు న్యాయం చేశానని, 142 తాత్కాలిక దుకాణాలకు పర్మినెంట్ షాపులు వేయించానన్నారు. నేను మంచి పని చేసి ఉంటేనే నాకు ఓటు వేయండని ధైర్యంగా ప్రజలను అడుగుతానని అన్నారు. సున్నిపెంటలో నివసిస్తున్న ప్రజలకు నామినల్ రెంట్‌తో వారికి రెగ్యులరైజేషన్ చేస్తానని హామీ ఇచ్చారు. శ్రీశైల మండలాన్ని అర్బన్ మండలం కింద చేర్చారని, త్వరలో ఇళ్ల కేటాయింపు జరుగుతుందని అన్నా రు. అలాగే శ్రీశైలంలో ఏంపీడీవో కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

జాబ్‌మేళాకు వచ్చే వారికి బస్సు చార్జీలు

శిల్పా ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరులో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు శ్రీశైలం, సున్నిపెంట నుంచి వచ్చే వారికి ఉచిత భోజనం, బస్సు చార్జీలు సొంతంగా ఇస్తానని ఎమ్మెల్యే శిల్పా తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎం ఏ.రజాక్, మండల ఇన్‌చార్జి భరత్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు జిల్లెల లక్ష్మీదేవి, నసీమ, ప్రభావతి, ఏడుకొండలు, నటరాజ్, కృష్ణమోహన్‌రెడ్డి, పాపారావు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గురువారం ఉదయం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యే శిల్పాకు ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందజేసి సత్కరించారు.

కోలుకోలేక యువకుడి మృతి

నందికొట్కూరు: నిద్ర మాత్రలు మింగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కౌశిక్(24) కోలుకోలేక బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. పట్టణంలోని సాయిబాబాపేటకు చెందిన నాగేంద్రప్రసాద్, పుష్పలత దంపతుల పెద్ద కుమారుడు కౌశిక్(24) బెంగుళూరుకు చెందిన ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్‌ఫ్రం హోమ్ చేస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతని విరక్తిచెంది ఆదివారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక పోయాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మల్లిరెడ్డి చెన్నయ్య తెలిపారు.

కౌలు రైతు రక్షణ యాత్రను జయప్రదం చేయండి

కొత్తపల్లి: కౌలు రైతులకు మేలు జరిగేలా చట్టాన్ని సవరించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కౌలు రైతు రక్షణ యాత్రను జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, ఎస్ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు సంజీవరాయుడు పిలుపునిచ్చారు. గురువారం సింగరాజుపల్లె గ్రామంలో రైతు రక్షణ యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఏసన్న, గోదా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఏఓగా సురేష్‌కుమార్


మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా గురువారం సురేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి తెలిపారు. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్‌కుమార్‌కు పదోన్నతి పొంది మిడుతూరు ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా బాధ్యతలు చేపట్టారు.

నేలవాలిన చెట్లు

నందికొట్కూరు రూరల్ : మండలంలో బుధవారం రాత్రి ఈదురు గాలులు, వాన బీభత్సం సృష్టించాయి. మండలంలోని దామగట్ల, బొల్లవరం, వడ్డెమాను, శాతనకోట గ్రామాలకు వెళ్లే రహదారులపై చెట్లు పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ స్తంభాలు కింద పడిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

ముస్లింల గుండెల్లో చిరస్థాయిగా సీఎం జగనన్న

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ అబుబక్కర్ అన్నారు. గురువారం పట్టణంలోని ముబారక్ షాదీఖానాలో 'హర్ దిల్ మే వైఎస్సార్– హమ్ సబ్ జగన్ కే సాథ్' అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగనన్న తండ్రి బాటలోనే నడుస్తున్నారని గుర్తు చేశారు. ముస్లిం విద్యార్థులకు ఫీజురియింబర్స్‌మెంట్ అందించిన ఘనత రాజన్నకు, జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న ఇమామ్‌లకు, మౌజన్లకు, విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటు అందించారని చెప్పారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు సబ్సిడీ కింద రూ.80 వేలు జగనన్న ప్రభుత్వం అందించి ముస్లిం గుండెల్లో ఉన్నారన్నారు. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీని ముస్లిం చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. కే యూనూస్‌బాషా, కౌన్సిలర్లు హమీద్, కో ఆప్షన్ సభ్యులు గఫార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, రహిమాన్, జబ్బార్, ప్రభుత్వ ఖాజీ మౌలానా సయ్యద్ జలాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అబుబక్కర్

అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే విక్రయించాలి

కొత్తపల్లి: విత్తనాల దుకాణం దారులు అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని ఆత్మకూరు సహాయ సంచాలకులు ఆంజనేయ అన్నారు. గురువారం ఆయన మండలం కేంద్రంలోని పుష్కర ఆగ్రో ఏజెన్సీ, రాజేశ్వరీ విత్తన దుకాణాలను ఏఓ మహేష్‌తో కలిసి తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, కల్తీవిత్తనాలను విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. నిర్ణయించిన ధరలకన్నా అధికంగా రేటు అమ్మితే లైసెన్స్‌లు రద్దుచేస్తామన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు చరణ్, సుశీల, రైతులు పాల్గొన్నారు.

మొదటిరోజే 'జగనన్న విద్యాకానుక'

జూపాడుబంగ్లా: ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటిరోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక ను పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటిదాకా 1 నుంచి 8 వరకు 3,368మందికి, 9,10 తరగతులకు చెందిన 994మంది విద్యార్థులకు యూనిఫాం మంజూరైనట్లు తెలిపారు. 3,212మందికి బెల్టులు, 506మంది 6తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 1 నుంచి 5 వరకు 342మంది విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీలు మంజూరైనట్లు తెలిపారు. ఇంకా బూట్లు, నోట్‌పుస్తకాలు, బ్యాగులు మంజూరు కావాల్సి ఉందన్నారు. మంజూరైన వాటిని ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరవేసినట్లు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలు

మిడుతూరు: సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయులుగా గురువారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంఈఓ మౌలాలి తెలిపారు. మిడుతూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా డాలు సాయితిమ్మయ్య, కడుమూరులో శ్రీధర్ కిశోర్, చెరుకుచెర్లలో ఉమా మహేశ్వరరావు, తలముడిపిలో ఎం సులోచన, అలగనూరులో జెమిని గణేష్, చౌట్కూరులో రవిప్రకాష్‌రావు, దేవనూరులో సుబ్రమణ్యం, కలమందలపాడులో మల్లికార్జునరావు, వీపనగండ్ల జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎంగా రవికుమార్ బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థులు ఒత్తిడికి లోను కావద్దు

మహానంది: స్థానిక వ్యవసాయ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటుంటే నిర్భయంగా వెల్లడించాలని, ఒత్తిడికి లోను కావద్దని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ పి.సాంబశివరావు అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాలలో గురువారం రాత్రి హాస్టల్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా చదివితేనే మంచి ఫలితాలు సాధించొచ్చన్నారు. కళాశాల తరపున ప్రచురించిన శ్రీ మహానందీశ్వర అగ్రికల్చర్ మాగజైన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్, డాక్టర్ మధుసూదన్‌రావు, డాక్టర్ నాగమణి, స్టూడెంట్ ఆక్టివిటీ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.సతీష్‌రాహుల్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి, వార్డెన్ ఎల్.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాగజైన్ ఆవిష్కరిస్తున్న అతిథులు